సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం, 18, నవంబర్, 2023



ఇసుక అక్రమ రవాణా

కొత్తపల్లె చెరువు నుంచి టీడీపీ నాయకుడు నందకుమార్ జేసీబీతో ఇసుక తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. -8లో



సారా స్థావరంపై దాడులు

పారేనువారిపల్లె అటవీ ప్రాంతంలో నాటు సారా బట్టీలపై ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి 3,500 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 382 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	470	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 36.160 కిలోలు

పొలాల్లో.. ఎర్ర బంగారం

- ఇక రైతన్నల పొలాల్లో ఎర్ర చందనం
- సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు
- ఆంక్షలు ఎత్తివేసిన కేంద్ర ప్రభుత్వం
- శేషాచలం అడవుల్లో విస్తరించిన చెట్లు
- అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ హెక్టార్లు
- వైఎస్సార్ జిల్లాలో 3.2 మిలియన్ హెక్టార్లు



శేషాచలంలో విస్తరంగా పెరిగిన ఎర్రచందనం వృక్షాలు

రాజంపేట: కేంద్ర ప్రభుత్వం ఎర్రచందనంపై ఆంక్షలు ఎత్తి వేయడం రైతులకు ఊరట కలిగించింది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆరు మిలియన్ హెక్టార్లలో శేషాచలం అడవులు విస్తరించి ఉన్నాయి. విదేశాలకు తరలిపోకుండా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు 2015లో తిరుపతి హెడ్ క్వార్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం యాంటీ స్మగ్లర్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. అడవుల్లో నిత్యం కూంబింగ్ చేస్తూ ఈ చెట్లను నరకకుండా అడ్డుకుంటోంది. గత 15 ఏళ్లలో 15లక్షల టన్నుల ఎర్రబంగారం విదేశాలకు తరలిపోయింది. ఈ జిల్లాల్లో రైతులు గతంలో తమ పొలాల్లో ఎర్రచందనం మొక్కలు పెంచుకొనేందుకు ఆసక్తి చూపినా ఆంక్షలుండడంతో ఎగుమతులు కష్టమై వదిలేశారు. తాజాగా నిబంధనలు ఎత్తి వేయడంతో వారికి మార్గం సుగమమైంది. మూడు నెలల్లో మొక్కలు పెంచుకోవడానికి ప్రభుత్వం నిర్దేశించిన ధరతోనే రైతులకు అందజేస్తుంది. ఆసక్తి చూపే రైతులకు ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమవుతోంది. ఎగుమతులు చేసుకునేందుకు అవకాశం ఉంటే తాము సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు.

శేషాచలం, వెలుగొండలోనే అధికం

ప్రపంచంలోనే అరుదైన ఎర్ర చందనం రాయలసీమ ప్రాంతం ఉన్న కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఈ కొండలు దాదాపు 5.5 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, లక్కమల, నల్లమల అడవులు తూర్పుకనుమల్లో ఉన్నాయి. వాటిలో ఎక్కువగా శేషాచలం. వెలుగొండలో మాత్రమే ఎర్రచందనం పెరుగుతోంది. శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనానికి ఎక్కువ చేవ ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. రాజంపేట ఎర్రచందనం నాణ్యతలో ప్రప్రథమం. ఇప్పటికే వైఎస్సార్‌జిల్లాలో 3.2 మిలియన్ల హెక్టార్లలో, అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ల హెక్టార్లలో ఎర్రచందనం మొక్కలు విస్తరించి ఉన్నాయి.

ఇంత డిమాండ్ ఎందుకు..

చైనా, జపాన్‌లో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలు కూడా ఎర్ర చందనంతో చేసినవి వాడుతుంటారు. సంగీత వాయిద్యాలు తయారుచేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తారు. చైనా, జపాన్‌తోపాటు రష్యా వాళ్లు కూడా ఎర్రచందనాన్ని కొనుగోలు చేస్తుంటారు. అందులో ఔషధ గుణాలు ఉన్నాయి. వయగ్రా, కాస్మెటిక్, ఫేస్ క్రీమ్ లాంటి వాటిలో వీటిని వాడుతారు. అల్సర్‌ను తగ్గించే గుణం కిడ్నీ సమస్యలు, రక్తాన్ని శుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్రచందనంలో ఉంటాయని నిపుణులు అంటున్నారు.

నాడు

కేంద్ర ప్రభుత్వం 2004లో వాణిజ్య పరంగా విధించిన ప్రభుత్వ ఆంక్షలతో అడవిలో స్మగ్లింగ్, ఎగుమతుల కోసం పోరు.. తరలింపునకు కూలీల కష్టాలు, పోలీసుల నుంచి వారికి కలిగే నష్టాలు ఇప్పటి వరకూ కనిపించాయి. దేశ, విదేశాలలో విలువ పెరగడంతో అక్రమ రవాణాకు ఆజ్యం పడింది. స్మగ్లింగ్ చేసే వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎంతోమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ వ్యాపారంలో కొందరు కోట్లకు పడగలెత్తారు.



నేడు

ఈ నెల ఆరో తేదీ నుంచి స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సు (కన్వెక్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్డేజర్ స్పీషీస్ ఆఫ్ పోరా అండ్ ఫౌనా)లో ఎర్ర చందనంపై ఆంక్షలు తొలగించాలని వివిధ దేశాల ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఎర్ర చందనం సాగు, ఎగుమతులపై ఉన్న ఆంక్షలు తొలగిస్తున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్‌యాదవ్ ఈ మేరకు ప్రకటన చేశారు. సాగుచేయాలనుకున్న రైతులకు కేంద్రం ఊరట ఇచ్చింది.

ఎర్రచందనం అనే పేరు ఎలా..



ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. టెరో కార్పస్ సాంటలైనస్ అనేది దీని శాస్త్రీయ నామం . టెరో అనే గ్రీక్ మాటకు ఉడ్(కర్ర) అని అర్థం. కార్పస్ అంటే పండు. దాని కాయ చాలా గట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. మొక్క రావాలంటే ఏడాది పడుతుంది. దీన్నే ఎర్రచందనం రక్తచందనం, శాంటాలం, ఎర్రబంగారం అని కూడా అంటారు. ఇది ప్యాబేసి వర్గానికి చెందిన మొక్క. దీని దుంగ ఎర్రగా ఉండటం వల్ల ఎర్రచందనం అంటారు.

ఎర్ర చందనం సాగుకు అనుమతి ఇచ్చింది



ఎర్ర చందనం సాగుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలో ఎర్రచందనం చెట్లు పెంచుకోవడానికి మొక్కలను ప్రభుత్వం నిర్దేశించిన రేటులో రైతులకు అందజేస్తుంది. మూడు నెలల్లో ఎర్ర చందనం మొక్కలను అందజేస్తాం. కేంద్రం అనుమతివ్వడంతో ఎర్రబంగారం పండించుకునే అవకాశం రైతులకు కలిగింది. ఆంక్షలు ఎత్తివేయడంతో స్మగ్లింగ్‌కు అవకాశం లేకుండాపోతుంది. – వివేక్, జిల్లా అటవీశాఖాధికారి

న్యూస్‌రీల్

చిట్వేలిలో కబడ్డీ పోటీలు



ఆట స్థలాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా వ్యవస్థాప కార్యదర్శి పీడీ.డేవిడ్‌ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆది, సోమవారాల్లో మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 13 జిల్లాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా ఎస్టీ ఎస్‌ఐ కార్యదర్శి వసంత మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా క్రీడాకారులకు ప్రయాణ ఖర్చులు, క్రీడా దుస్తులు, ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన



డ్రిప్ పద్ధతిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఒంటిమిట్ట: మండలంలోని ఒంటిమిట్టలో కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్ శిక్షణ అధికారుల బృందం సభ్యులు శుక్రవారం పర్యటించారు. ముందుగా ఒంటిమిట్ట కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. అందులో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా చెంచుగారిపల్లి రైతు సి.రామచంద్రరెడ్డి సాగు చేస్తున్న 4.90 సెంట్లలోని చీనీ తోట, ఒంటిమిట్టలోని జగనన్న కాలనీ, అక్కడే ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వారు పరిశీలించారు. ఈ పరిశీలనలో బృందం సభ్యులు రోహిత్, భరత్, బ్రిజేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మండలంలోని గోళ్లపల్లె, రఘునాథపురం గ్రామాల్లో అభివృద్ధి పనులను శుక్రవారం కేంద్ర బృందం సభ్యులు అంకుర్ దహియా, మన్‌మీట్ సింగ్, మనోజ్‌కుమార్, రాఘవ్, అనురాగ్ జైస్వాల్, ఇందిరా దూబే, త్రేశుప్రకాష్ శుక్రవారం పరిశీలించారు సచివాలయ సిబ్బందిని అడిగి పనుల వివరాలను తెలుసుకున్నారు.

22న ల్యాబ్ టీచర్లకు శిక్షణ

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించి ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న 16 ల్యాబ్‌ల ఇన్‌చార్జి టీచర్లకు ఈ నెల 22వ తేదీన ఒక్కరోజు శిక్షణ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం విజయవాడలోని సాయిజువెల్ కన్వెన్షన్ సెంటర్లో జరుగుతుందన్నారు. 16 ల్యాబ్‌ల ఇన్‌చార్జి టీచర్లు తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. ఇది ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఆదేశమని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డిని 9441035830 ఫోన్ నంబర్లో సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

22న వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని వ్యాయామవిద్య, క్రీడాశాస్త్ర శాఖ ఆవరణంలో ఈనెల 22వ తేదీ వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి తెలిపారు. అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే పురుషులు, మహిళల జట్టుకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే వారు కళాశాల స్టడీ సర్టిఫికెట్, పది, ఇంటర్, డిగ్రీ మార్కులిస్టులు, జిరాక్స్ ప్రతులను తీసుకురావాలన్నారు. 17 నుంచి 25 సంవత్సరాలలోపు విద్యార్థులు ఎంపికలకు అర్హులన్నారు.

20న ధృవపత్రాల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో జాతీయ అర్బన్ ఆరోగ్య పథకంలో ఏర్పడిన తొమ్మిది మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థుల జాబితాను హెచ్‌టీపీపీఎస్://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం కడపలో ధృవపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీకి ఎంపిక

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం. లక్ష్మీనరసింహ ఢిల్లీలోని జాతీయ విద్యా, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సైకాలజీ అండ్ ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాడు. సైకాలజీ విభాగాధిపతి డా. కె. లలిత, సహ ఆచార్యులు డా. వి. లాజరస్ ఆధ్వర్యంలో డా. లక్ష్మీనరసింహ మర్యాదపూర్వకంగా వీసీ, రిజిస్ట్రార్‌లను కలిశారు. వారు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.రవి, అశ్వర్థరెడ్డి, టి. సురేష్‌బాబు పాల్గొన్నారు.

కడప జోన్‌కు 400 బస్సులు



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్టీసీ కడప ఆర్టీసీ జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

రాజంపేట: కడప ఆర్టీసీ జోన్‌కు వచ్చే ఏడాది మార్చి నాటికి 400 కొత్త బస్సులు రానున్నాయని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. రాజంపేట ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 200 కొత్త బస్సులు రోడ్డెక్కాయని తెలిపారు. గత ఏడాది ఆర్టీసీ రూ.330 కోట్ల నష్టాల్లో నడిచిందని, ఈ ఏడాది రూ.21 కోట్లు తగ్గించగలిగామన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమం నెలలో రెండు సార్లు నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రయాణికులతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టరు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సంస్థను లాబాల బాటలో నడిపించేందుకు ఆర్టీసీ కార్గో సేవలు చేపట్టిందని తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లోని అన్ని డిపోల పరిధిలో మెరుగైన సేవలందించే విషయంలో మార్గదర్శకాలను తీసుకొస్తామన్నారు. అనంతరం డిపో సర్వీసులపై సమీక్షించారు. నాలుగు రూట్‌లలో గిఫ్ట్ స్కీం పెట్టాలని సూచించారు. బస్టాండు, కార్గో పాయింట్‌ను పరిశీలించారు. ఈడీని రాజంపేట డిపో కార్మిక సంఘాల నేతలు కలిశారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ తరపున నరసింహులు, ఎంప్లాయిస్ యూనియన్ తరపున మౌలా తదితర నేతలు ఈడీని కలిసి సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో పి.రాము, డీఎం గుండాల రమణయ్య, అధికారులు ప్రమీల, మాధవీలత, దాసరి కృష్ణమూర్తి , శంకరయ్య పాల్గొన్నారు.

పేదల భూములకు సర్వ హక్కులు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

రాయచోటి: పేదల భూములకు యాజమాన్య హక్కులు కల్పించి భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో పేదలకు భూ పంపిణీ, నిషేధిత భూములకు భూ యాజమాన్య హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డితో కలిసి 2100 మంది లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ వ్యవస్థలో చారిత్రాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎవరూ చేయలేని సాహసోపేత నిర్ణయాన్ని తీసుకుని అసైన్డ్, ఇనాం, ఎస్సీ కార్పొరేషన్, చుక్కల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భూహక్కు పత్రాలు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లాలో 90శాతం వరకు భూ సమస్యలు ఉన్నాయని, 30084 ఎకరాల నిషేధిత భూములపై రైతులకు హక్కులు కల్పిస్తున్నామన్నారు.

నిషేధిత భూములకు విముక్తి: ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి

నిషేధిత భూములకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడం ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు విడతలుగా లక్షల ఎకరాలలో రీ సర్వే పూర్తి చేసి రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారన్నారు. పేదలు తమ భూములను అమ్ముకుండా వ్యవసాయం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ రైతు భరోసా ఇస్తామన్నారు. ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, పోలు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రేమంత్‌కుమార్, మల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రబీలో ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న పంజం సుకుమార్‌రెడ్డి

రాయచోటి : రబీలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రైతులు పెసలు, అలసందలు, పొద్దుతిరుగుడు పంటలు సాగుచేయాలన్నారు. వేరుశనగ పంట డిసెంబరు 30వతేదీ వరకు విత్తుకునే అవకాశం ఉందని కేవీకే శాస్త్రవేత్త తెలిపారు. జిల్లాలో యూరియా, డీఏపీ, పొటాషియం, సూపర్ ఫాస్పేట్ కలిసి మొత్తం 15483 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, రైతులకు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ 2023–24 రబీ సీజన్‌లో వ్యవసాయ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, బోధిషావలి, రవిరాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవశకం



పేదల కల సాకారమవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధిదారులలో ఆనందం వెల్లివిరుస్తోంది. గతంలో జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా మంజూరవని పథకాలు నేడు ఇంటికే వచ్చి చేరుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

పెన్షన్ కానుక

18 ఏళ్ల తర్వాత ఫించన్



18 ఏళ్ల కిందట నా భర్త చనిపోయారు. అప్పట్లో కొన్ని సాంకేతిక లోపాలతో నాకు వితంతు పింఛన్ మంజూరు కాలేదు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టారు. సచివాలయ సిబ్బంది సహకరించి నాకు పింఛను మంజూరు చేయించారు. మూడు నెలలుగా నగదు అందిస్తున్నారు. –గొంటు చిన్నక్క, సాలాబాద్ గ్రామం, ఒంటిమిట్ట మండలం

జగనన్న సురక్ష

ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు



వాలంటీరు ఇంటికి వచ్చి ఆధార్, రేషన్ కార్డు తీసుకెళ్లారు. వారం రోజులుకే జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉచితంగా అందజేశారు. గతంలో రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వో చుట్టూ తిరిగాను. ఇపుడు శ్రమ లేకుండానే నాకు ధ్రువీకరణ పత్రం అందించారు. – చిన్నబాబు, గాంధీ వీధి, సిద్ధవటం

పేదలందరికీ ఇళ్లు

సొంతింటి కల సాకారం



రైల్వే స్టేషన్‌లో పనులు చేసుకుంటున్నా. ఏళ్లుగా రేకుల షెడ్‌లో ఉన్నా. ఆర్థిక స్తోమత లేక సొంతిల్లు కట్టుకోలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. రోడ్లు, వీధి దీపాలు, నీటి సౌకర్యం కల్పించారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టుకొన్నాం. – ఎం.శ్రీలత, గృహిణి, కూలి, ఓబుళవారిపల్లె

నాడు - నేడు

అధునాతన వసతులతో బడి



గతంలో బడికి పంపాలంటే ఖర్చులు భరించాల్సి ఉండేది.ఎ˘ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. 'నాడు నేడు' పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. అన్నీ ఉచితంగా ఇచ్చారు. ఆర్థిక చేయూత ఇచ్చినందుకు సీఎంకు రుణపడి ఉంటాం. – జగన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, పీలేరు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి



ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమీక్షిస్తున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే, ఎస్పీ, జేసీలు

రాయచోటి: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జేసీ ఫర్మన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సంఘటన జరిగిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది జులై 1 నుంచి అక్టోబర్ 31 వరకు 28 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కాగా ఇందులో మూడు ఫాల్స్, నాలుగు పబ్లిక్ ట్రైల్స్‌లో ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేయడం జరుగుతుందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శిక్షణ అధికారులు

భారత దర్శన్‌లో భాగంగా భారతదేశ పార్లమెంట్ కార్యాలయ సహాయ సెక్షన్ అధికారులు ఇందిరాదుబే, ప్రకాష్, మనోజ్‌కుమార్ తదితరులు కలెక్టర్ గిరీషా పీఎస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పరిశ్రమలతోనే అభివృద్ధి

పరిశ్రమల స్థాపనతోనే అన్నమయ్య జిల్లా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమల ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన పరిశ్రమలు స్థాపించేందుకు ఇప్పటివరకు 1548 దరఖాస్తులకు ఆమోదం తెలిపామన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కిందదారు యూనిట్లకు(వాహనాలు) పెట్టుబడి రాయితీగా రూ.3,81,7822 లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అధికారులు జయలక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్ రెడ్డి, దినేష్ చంద్ర, ధనలక్ష్మి, నారాయణరెడ్డి, నాగభూషణం, రాజశేఖర్, రామ్మూర్తి నాయక్, రామకృష్ణ, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరికీ ఓటు హక్కు కల్పించాలి

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా చూడాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో విడియో కాన్ఫరెన్స్ ద్వారా ముసాయిదా ఓటరు జాబితా, తదితర అంశాలపై మండల అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో ఓటరు జాబితా తయారీ చేసేందుకు ఎక్కువ సమయం కేటాయించాలని తహశీల్దార్లను ఆదేశించారు. వీఆర్వోల లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి

రామసముద్రం : మండలంలోని అరికెల పంచాయతీ చింతమాకులపల్లెలో వెంకటరెడ్డి గడ్డివామి వేయుటకు చదును చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన శ్రీరాములు, అతని కుమారుడు గంగరాజు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు పుంగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ కేసులో రెండేళ్ల జైలు

మదనపల్లె : ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు కింది కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్షను పైకోర్టు ఖరారు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022 జూన్ 12వ తేదీ క్రైమ్ నంబర్: 222/2022తో ద్విచక్రవాహనాల చోరీపై కేసు నమోదైంది. ఈ కేసుతోపాటు పలు కేసుల్లో బైక్ చోరీలకు పాల్పడిన నిందితులు కర్ణాటక కోలార్ జిల్లా బంగారుపేటకు చెందిన సత్యప్ప కుమారుడు జాగి బంగారప్ప(25), కోలార్ టౌన్ వాసంత కుమారుడు ఫైరోజ్(25)లను 2022 ఆగస్టు 8న టూటౌన్ సీఐ మురళీకృష్ణ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై మదనపల్లె ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో విచారణలు ముగిసిన అనంతరం 2023 జనవరి 31న న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలుశిక్ష విధించారు. ఈ శిక్షపై నిందితులు పైకోర్టు అయిన అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేసిన ఏడీజే అబ్రహాం కింది కోర్టు విధించిన రెండేళ్ల శిక్షను ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు.

యువకుడి ఆత్మహత్య



సుశాంత్‌కుమార్ మృతదేహం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ గుడిసివారిపల్లెకు చెందిన వినయ్‌కుమార్, ప్రేమకళ దంపతుల కుమారుడు సుశాంత్‌కుమార్(19) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పనులు ముగించుకుని మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు కుమారుడిని గట్టిగా మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సుశాంత్ కుమార్ గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని కిందకు దించి హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందిస్తుండగానే, మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుక్కరాజుపల్లెకు చెందిన గోపాల్‌రెడ్డి కుమారుడు శివరామరెడ్డి(50) పలువురి వద్ద అధికమొత్తంలో అప్పులు చేశాడు. ఇటీవల రుణదాతల ఒత్తిడి పెరగడంతో శుక్రవారం ఇంటివద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ ఉపసర్పంచ్ ఇసుక అక్రమ రవాణా

- అనుమతులు లేకుండా వంకలో తవ్వకాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- స్థానికుల ఫిర్యాదుతో వెలుగుచూసిన వైనం



కొత్తపల్లె ఓబుళంచెరువులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె ఉపసర్పంచ్, టీడీపీ నాయకుడు నందకుమార్ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన చెరువులో బయటకు కనిపించకుండా మధ్యాహ్న సమయంలో జేసీబీతో తవ్వకాలు జరుపుతూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. కొత్తపల్లె చెరువులో టీడీపీ ఉపసర్పంచ్ ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారంటూ గ్రామస్తులు మీడియాకు సమాచారం అందించారు. దీంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించగా, చెరువులో నుంచి ట్రాక్టర్లు ఇసుక లోడ్ చేసుకుని బయటకు వస్తూ కనిపించాయి. గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్న అక్రమ రవాణా మీడియా కంటపడిందన్న విషయం ట్రాక్టర్ డ్రైవర్లు ఉపసర్పంచ్‌కు చేరవేశారు. దీంతో అప్రమత్తమైన ఆయన తనకు ఇసుక అక్రమ రవాణా చేయాల్సిన అవసరం లేదని, గ్రామంలో డ్రైయిన్ల నిర్మాణానికి తరలిస్తున్నానంటూ చెప్పుకొచ్చారు. పైపెచ్చు తనకు గతంలో పంచాయతీరాజ్ డీఈగా పని చేసిన శివప్రసాద్ 40 ట్రాక్టర్లు తోలుకునేందుకు అనుమతులిచ్చినట్లు చెప్పుకొచ్చాడు. ఈ విషయమై డీఈ శివప్రసాద్‌ను విచారణ చేస్తే.. తాను మూడునెలల క్రితం సీసీ రోడ్లుకు అని అడిగితే నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకుంటే అనుమతిస్తానని చెప్పానన్నారు. డ్రైయిన్లు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి సంబంధించినవని, ప్రస్తుతం తాను బదిలీపై వేరే చోట పని చేస్తున్నానని.. ఇసుక అక్రమ రవాణాకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కొత్తపల్లె ఓబుళనాయనిచెరువులో నుంచి ట్రాక్టర్లు గ్రామసచివాలయం ఎదురుగానే వెళుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపల్లెకు సర్పంచ్‌గా బీసీ మహిళ లక్ష్మీదేవి ఉన్నప్పటికీ, పంచాయతీలో ఉపసర్పంచ్ నందకుమార్ అన్నీ తానై వ్యవహరిస్తూ.. అధికారులు, సచివాలయ సిబ్బందిపై అధికారం చెలాయిస్తున్నారు. అభివృద్ధి పనుల విషయంలోనూ ఇతరులకు అవకాశం ఇవ్వకుండా తానే కాంట్రాక్టర్ అవతారమెత్తినట్లు గ్రామస్తులు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ పనులకు సంబంధించి ఇసుక రీచ్‌ల నుంచి కాంట్రాక్టర్ కొనుగోలు చేయాల్సి ఉంది. చెరువులో నుంచి తోలుకోవాలన్నా జలవనరుల శాఖ, రెవెన్యూ అనుమతితోపాటు పంచాయతీకి సీనరేజీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే.. ఇవేమీ పాటించకుండా తనను ఎవరు అడుగుతారనే ధైర్యంతో టీడీపీ ఉపసర్పంచ్ చేస్తున్న ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం

ప్రభుత్వ ఉద్యోగితోపాటు మరో వ్యక్తికి గాయాలు



గాయపడిన మల్లికార్జున

మదనపల్లె : ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రభుత్వ ఉద్యోగితోపాటు మరో వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం గాంధీపురానికి చెందిన పి.మల్లికార్జున(30) అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రభుత్వ సమాచార శాఖ కార్యాలయంలో ఫోటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు రాయచోటిలో విధులకు వెళ్లేందుకు మదనపల్లెలో పుంగనూరు డిపోకు చెందిన కడప-పుంగనూరు సర్వీస్ ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మార్గంమధ్యలోని కురబలకోట మండలం సర్కారుతోపు వద్ద ఎగుడుదిగుడు రోడ్డులో బస్సును డ్రైవర్ వేగంతో వెళ్లి నిర్లక్ష్యంగా గుంతలో ఒక్కసారిగా దింపడంతో.. వెనుకసీటులో కూర్చున్న మల్లికార్జునతోపాటు రాయచోటికి చెందిన కృష్ణయ్యనాయుడు కుమారుడు శరత్‌కుమార్(19) గాయపడ్డారు. దీంతో బస్సులోని ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఇద్దరినీ మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి మల్లికార్జున వెన్నెముకకు తీవ్ర గాయమైనట్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అంగళ్లు-మదనపల్లె మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న చోట ఆర్టీసీ డ్రైవర్ బస్సును నిర్లక్ష్యంగా నడపడం వల్లనే తాను గాయపడినట్లు బాధితుడు మల్లికార్జున మీడియాతో ఆవేదన వ్యక్తం చేశాడు.

ద్విచక్రవాహనం ఢీకొని బాలుడికి గాయాలు

ద్విచక్రవాహనం ఢీకొని బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. ఇందిరానగర్‌కు చెందిన జమీర్ కుమారుడు హర్మాన్(11) ఇంటి ముందు ఆడుకుంటుండగా, గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడగా, కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఔషధరంగంలో విస్తృత పరిశోధనలు జరగాలి



మాట్లాడుతున్న మాజీ వీసీ చంద్రశేఖర్

రాజంపేట : ఔషధరంగంలో పెనుమార్పులు వస్తున్నాయని, వాటికి తగ్గట్టుగా పరిశోధనలు విస్తృతం కావాలని కృష్ణా యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, అనంతపురం జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్ కేబీ చంద్రశేఖర్ అన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాల (ఏఐటీఎస్)లో రెండు రోజుల పాటు జరిగే బయోఫార్మా సంవాద్-2023 జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సదస్సుల లాంటి ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతుల ప్రదర్శనలు, బోధనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. సదస్సులో ఏపీటీఐ(ఫార్మాటీచర్స్) స్టేట్ బ్రాంచి అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాండిచ్చేరి మదర్ థెరిస్సా కళాశాల, పరిశోధన కేంద్రం ప్రొఫెసర్ వి.గోపాల్, ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, వైవీయూ జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్‌వీ రమణారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, వివిధ రాష్ట్రాల నుంచి ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకరిపై కేసు నమోదు

కలసపాడు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన విలేకరి పసుపుల నాగేశ్వర్‌రావుపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ నాగమురళి తెలిపారు. ఈ నెల 12న దీపావళి సందర్భంగా కలసపాడుకు చెందిన అక్కిసునీత కలసపాడు శివారు ప్రాంతంలో టపాసుల లైసెన్స్ దుకాణం ఏర్పాటు చేసుకుని టపాసులు విక్రయిస్తోందని ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఓ సంస్థ(సాక్షి కాదు) విలేకరి నాగేశ్వర్‌రావు దుకాణం వద్దకు వెళ్లి ఉచితంగా టపాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. ఉచితంగా ఇవ్వబోమని ఆమె తెలిపిందన్నారు. నీ లైసెన్స్‌ను రద్దు చేయిస్తానని బెదిరించారని చెప్పారు. ఈ నెల 13వ తేదీన ఎస్పీకి స్పందనలో సునీత ఫిర్యాదు చేసిందన్నారు. పరిశీలించి శుక్రవారం నాగేశ్వర్‌రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రామాంజులు

బి.కొత్తకోట : అనంతపురం జిల్లా నుంచి తిరుపతి వైపు వెళ్తున్న రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. శుక్రవారం సాయంత్రం బి.కొత్తకోట మండలం గొళ్లపల్లె గ్రామంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి శ్రీసత్యసాయి జిల్లా కదిరి రైల్వే ఎస్సై ఎస్.రహీం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండలం భూములగడ్డ- వలసపల్లికి సమీపంలోని అటవీప్రాంతం వద్ద కాపురం ఉంటున్న బూరగమంద రామాంజులు(55) భార్య కనకతో దూరంగా ఉంటున్నాడు. మూడేళ్లుగా ఒంటరి జీవితం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని గొళ్లపల్లెలో టెంటు వేసుకుని సమీపంలోని గుట్టల్లో వనమూలికలు సేకరించి, విక్రయాలు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. భార్య పిల్లలు దూరంగా ఉండటంతో మనస్తపం చెందేవాడు. ఒంటరి జీవితంపై విరక్తి చెందిన రామాంజులు గొళ్లపల్లెకు సమీపంలోని రైలు పట్టాలమీదకు వెళ్లి రైలుకు ఎదురు వెళ్లడంతో కిందపడి, తీవ్ర గాయాలతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన సమాచారం అందుకున్న కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతుడు రైలుకు ఎదురెళ్లి చనిపోయాడా? రైలు పట్టాలు దాటుతున్నప్పుడు లేకపోతే పక్కగా వెళ్తున్నప్పుడు రైలు ఢీకొని మృతి చెందాడా? అన్నది దర్యాప్తులో తేడాల్సి ఉంది. మృతుడు ఒంటరిగా ఉంటుండడంతో మృతదేహం కోసం కుటుంబీకులు, బంధువులు ఎవరూ రాలేదని తెలిసింది.

నాటుసారా స్థావరంపై ఎస్‌ఈబీ దాడులు



ఎస్‌ఈబీ అధికారుల అదుపులో నిందితులు

మదనపల్లె : నిమ్మనపల్లె మండలం పారేసువారిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో 12 మంది తయారీదారులను అరెస్ట్ చేయడంతోపాటు 3,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. పారేసువారిపల్లెలో పెద్ద మొత్తంలో నాటుసారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు జరిపామన్నారు. అందులో గ్రామానికి చెందిన పారేశి గంగాధర్(35), పారేశి మణికంఠ(28), టేకుమంద నరసింహులు(39), పారేశి శివమూర్తి(37), బొంగ మనోహర్(45), పారేశి శ్రీనివాసులు(55), పారేశి రెడ్డెప్ప(36), పారేశి నరసింహులు(43), పుత్రా సురేంద్ర(37), పారేశి వెంకటరమణ(60), బొంగా మల్లికార్జున(45), రామన్న(45)లు నాటుసారా తయారీలో ప్రధాన నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. వీరితో పాటు అక్రమ నాటుసారా తయారీ వ్యవహారంలో పాత్రధారులైన అదే గ్రామానికి చెందిన మరి కొందరిపైనా, అదేవిధంగా అక్రమ నాటుసారా తయారీకి కావాల్సిన ముడిసరుకు నల్లబెల్లం సరఫరాదారునిపైనా కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఎస్‌ఈబీ దాడుల్లో బీఎంపీపీ ఎస్‌ఐ పి.రాజశేఖర్, డీటీఎఫ్ ఎస్‌ఐ రాయచోటి హేమకుమార్, సిబ్బంది హరికుమార్, మునిరామయ్య, చంద్రశేఖర్, దామోదర్, ప్రసన్నకుమార్, లవకుమార్, బాలకృష్ణ, రేఖారాణి, సునీల్, స్పెషల్‌పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్



మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్‌స్కూల్‌లతోపాటు ప్రైవేటు, ఎయిడెడ్, కస్తూరిబా, ట్రైబల్‌వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు చేయాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ జిల్లా కార్యదర్శి ఎం.నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరి చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డీఈఓలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లలో చేరిన విద్యార్థులకు రెండేళ్లు శిక్షణ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని వివరించారు. ఈ సర్టిఫికెట్లు గల విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ డేవిడ్, ట్రైనింగ్ ఇన్‌చార్జి రెడ్డెయ్య, ఎంఈఓలు బాలాజీ, ఆంజనేయులు నాయుడు, రిసోర్స్‌పర్సన్‌లు మధుర వాణి, ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, మాస్టర్ ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే మేడా సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

ఒంటిమిట్ట : మండలంలో టీడీపీ, జనసేనలో కార్యకర్తలుగా పని చేస్తున్న దాదాపు 100 మంది యువకులు శుక్రవారం ఒంటిమిట్టలోని హరితా హోటల్ వద్ద ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఎంతో మంది ప్రతిపక్ష పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారిని వైఎస్సార్‌సీపీ కచ్చితంగా గుర్తిస్తుందని, వారికి తగిన ఫలితం దక్కుతుందని, యువ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టా నారాయణ, కట్టా సుబ్బరాయుడు, పిడుగు సుబ్బారెడ్డి, పలుకూరి భాస్కర్, కట్టా విశ్వనాథ్, కట్టా రాజేష్, కట్టా సురేష్, కట్టా ప్రేమ్ కుమార్, మన్నేరు శివబాబు పాల్గొన్నారు.



రచయితల సభల్లో భాగస్వామ్యానికి అవకాశం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం డిసెంబరు 23, 24 తేదీలలో కడప నగరంలో మహాసభలను నిర్వహిస్తున్నామని, ఇందులో పలు అంశాలలో భాగస్వామ్యం పొందేందుకు పలువురు రచయితలు, కవులు, సాహిత్యాభిలాషులు, కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నామని రచతయిల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహాసభల్లో రెండు రోజుల పాటు సాహిత్య ప్రసంగాలు, పత్ర సమర్పణలు, పలు రకాల సాహిత్య ప్రక్రియల ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, సావనీర్‌లు, జిల్లా రచయితల పుస్తకాల ప్రదర్శన అమ్మకాలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాకు చెందిన రచయితలు తాము రాసిన పుస్తకాలను ప్రదర్శనలో ఉంచేందుకు సంఘ అధ్యక్షులను కనీసం 20 రోజుల ముందు సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఇంతకు ముందు నిర్వహించిన జిల్లా రచయితలు, అభ్యుదయ రచయితల సంఘాల మహాసభలకు సంబంధించిన సావనీర్‌లు కరపత్రాలు, కవుల రచయితల ప్రసంగ పాఠాలు, ఫోటోలు ఉంటే తమకు తెలపాలని వాటిని ప్రదర్శనలో ఉంచేందుకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రదర్శనకు యోగ్యమైన ఏ ఇతర సామాగ్రి తమ వద్ద ఉన్నా ఆ విషయం తమకు తెలపాలన్నారు. మరిన్ని వివరాలకు అధ్యక్షులు మూల మల్లికార్జున రెడ్డి 7700003399, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం 9704651414 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.